

ఓటర్ల జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలి

భీమవరం రూరల్ : స్పెషల్ సమ్మరీ రివిజన్ – 2024లో భాగంగా ఓటర్ల లిస్ట్ ప్యూరిఫికేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తాడేపల్లిగూడెం, ఉండి, పాలకొల్లు నియోజకవర్గాల ఎలక్షన్ డిటిలు, బిఎల్ఓలు, విఆర్ఓలతో సమావేశమై పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాలపై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. జులై 21వ తేదీ నుంచి బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల లిస్ట్ స్వచ్ఛీకరణ చేసే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతిపాదించిన బిఎల్ఎలు మీతో పాటు వస్తే అనుమతించాలన్నారు. సర్వేకు వెళ్లినప్పుడు 18 సంవత్సరాలు నిండిన వారు ఆ ఇంట్లో ఉంటే వారిని ఓటరుగా నమోదు చేయాలని, ఓటు ఉన్న వ్యక్తి మరణిస్తే వారి ఓటును ఓటర్ లిస్ట్ నుండి తొలగించాలన్నారు. 18 సంవత్సరాల వయసులోపు కలిగిన వారు ఎట్టి పరిస్థితుల్లో ఓటర్‌గా నమోదు కాకూడదన్నారు. సమావేశంలో డిఆర్ఓ కె.కృష్ణవేణి, ఉండి నియోజకవర్గ ఇఆర్ఓ రవి కుమార్ పాల్గొన్నారు.

వరద భయం..!

పెరుగుతున్న గోదావరి ఉధృతి

భద్రాచలం వద్ద 31 అడుగులకు చేరిన నీటిమట్టం

పోలవరం కాపర్ డ్యామ్ వద్ద నీటిమట్టం 29 మీటర్లు

దిగువకు లక్షా 65 వేల క్యూసెక్కుల నీరు విడుదల

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజల గుండెల్లో గుబులు

గతేడాది ఇదే సమయానికి వరద భీభత్సం

ఏడాదైన అమలు కాని ప్రభుత్వ హామీలు



కోడేరు వద్ద వరద ఉధృతికి కొట్టుకుపోతున్న ఇసుక ర్యాంపు

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

కుక్కునూరు, వేలేరుపాడు మండలంలోని గ్రామాల ప్రజలను వరద భయం వెంటాడుతోంది. వర్షాలకు గోదావరి ఉధృతి పెరుగుతుండటంతో గతేడాది భయానక పరిస్థితిని గుర్తు చేసుకుని తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 31 అడుగులకు చేరింది. పెద్దఎత్తున వరద నీరు వచ్చిపడుతుండటంతో పోలవరం కాపర్ డ్యామ్ వద్ద నీటిమట్టం 29 మీటర్లకు చేరింది. దీంతో సాయంత్రం ఐదు గంటలకు పోలవరం స్పిల్‌వే నుంచి లక్షా 65 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. గతేడాది ఈ సమయానికి గోదావరి వరదకు పోలవరం నిర్వాసిత గ్రామాల ప్రజల పరిస్థితి అత్యంత దారుణంగా మారిన సంగతి అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్లీ గోదావరి పెరుగుతుండటంతో అక్కడి ప్రజలు గుండెల్లో రైళ్లు పెరుగుతున్నాయి. ప్రతియేటా గోదావరికి వరదలు రావడం సహజమే. గతంలో ఎన్నడూ ఏజెన్సీ ప్రజలు వరదలకు పెద్దగా భయపడిన పరిస్థితి లేదు. అయితే పోలవరం ప్రాజెక్టులో కీలకమైన కాపర్ డ్యామ్ నిర్మాణం 44 మీటర్ల పూర్తి చేశారు. దీంతో చిన్నపాటి వరదకు కూడా గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. దీంతో రోజుల వ్యవధిలోనే గోదావరి వరద గ్రామాలను ముంచెత్తుతోంది. గడిచిన రెండు రోజులుగా అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. మంగళవారం జిల్లావ్యాప్తంగా సరాసరిన 20.05 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం సైతం భారీ వర్షం కురిసింది. గోదావరి పరివాహక ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున వర్షం కురుస్తుండటంతో గోదావరి నీటిమట్టం పెరుగుతోంది.

అమలు కాని సిఎం ప్రకటన

పోలవరం ప్రాజెక్టులో ముంపునకు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 107 గ్రామాల ప్రజలు నిర్వాసితులుగా మారుతున్నారు. వీరికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, భూమికి భూమి, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం, నిర్వాసిత కాలనీల్లో సదుపాయాలు వంటివి కల్పించి తరలించాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితుల గురించి పట్టించుకోకుండా ప్రాజెక్టు నిర్మాణంపైన దృష్టి సారించాయి. దీంతో ప్రతియేటా గోదావరి వరదకు నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది జులైలో విరుచుకుపడిన వరదలకు 90కుపైగా గ్రామాలు నీట మునిగాయి. కట్టుబట్టలతో జనం నిర్వాసిత కాలనీలకు చేరారు. వరద బాధితుల పరామర్శకు వేలేరుపాడు మండలం కన్నాయిగూడెం గ్రామం వెళ్లిన సిఎం జగన్ 2022 అక్టోబర్‌కు 41.15 కాంటూరులోని గ్రామాల నిర్వాసితులందరికీ పరిహారం ఇచ్చేస్తామని, 45.72 కాంటూరు నిర్వాసితులకు మాత్రం కేంద్రం సహకరించాల్సి ఉందని తెలిపారు. సిఎం ప్రకటించి ఏడాది గడిచినా 41.15 కాంటూరు పరిధిలోని 42 గ్రామాల్లోని నిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం అందించని పరిస్థితి నెలకొంది. ఎనిమిది వేల ఇళ్లు వరదలకు దెబ్బతినగా, కేవలం ఐదువేల పైచిలుకు ఇళ్లకు మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందించి చేతులు దులుపుకుంది. కాపర్‌డ్యామ్ అడ్డుగా కట్టడంతో వరదనీరు రెండు వారాలకుపైగా గ్రామాలను వీడలేదు. వరదకు చేరిన బురదను శుభ్రం చేసుకోవడానికి ఒక్కో కుటుంబానికి రూ.20 వేలు పైనే ఖర్చయింది. నిర్వాసితులంతా నెలలు తరబడి పునరావాస కాలనీల్లో గడపాల్సిన దుస్థితి నెలకొంది. మళ్లీ గోదావరికి వరద నీరు ఉధృతం అవుతుండటంతో గతేడాది గడ్డు రోజులను అక్కడి ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. తమకు ఆర్అండ్ఆర్ పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఒక్కరోజే కాపర్‌డ్యామ్ వద్ద వరద నీరు మీటర్‌కుపైగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితిని చూస్తే గతేడాది మాదిరిగా వేగంగా వరద వచ్చే ప్రమాదం కనిపిస్తోంది. ప్రభుత్వం అందుకు తగిన ముందస్తు చర్యలు తీసుకుని జనాలకు రక్షణగా నిలవాల్సి ఉంది.

పెరుగుతున్న గోదావరి..



పోలవరం కాపర్ డ్యామ్ వద్ద వరద ఉధృతి

ప్రజాశక్తి – ఆచంట

వశిష్ట గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువ నుంచి పెద్దఎత్తున వరద నీరు సముద్రంలోకి వదులుతుండటంతో బుధవారం సాయంత్రం నాటికి కోడేరు వద్ద 24 గంటల్లో సుమారు రెండు అడుగులు నీటిమట్టం పెరిగింది. ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి లంక గ్రామాల్లో ప్రజలు ఎటువంటి ఇబ్బందీ లేకుండా తమ పనులు యధావిధిగా చేసుకుంటున్నారు. ఇంజిన్ పడవలపై గోదావరిలో ప్రయాణికుల రాకపోకలు సాగుతున్నాయి. వరద ఉధృతి ఇదేస్థాయిలో పెరిగితే 2, 3 రోజుల్లో లంక గ్రామాలు ముంపు బారిన పడే ప్రమాదం ఉందని, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వరదల వల్ల కోడేరులోని ఇసుక ర్యాంపు కొట్టుకుపోయింది.

యలమంచిలి : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో గోదావరికి రెండు రోజులుగా వరద నీరు పెరిగింది. దీంతో లంక గ్రామాలైన కనకాయలంక, పెదలంక, యలమంచిలిలంక, బాడవ, లక్ష్మీపాలెం, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం తదితర గ్రామాల్లో మళ్లీ అలజడి మొదలైంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 14 అడుగులకు నీటిమట్టం పెరిగితే ఆ ప్రభావంతో కనకాయలంక కాజ్ వే మునిగిపోయే పరిస్థితి వస్తుందని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో తమ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే పరిస్థితి వస్తుందని తెలిపారు.



చించినాడ వద్ద మోస్తారుగా పెరిగిన గోదావరి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పాడి పశువుల కొనుగోలును ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

ప్రజాశక్తి – భీమవరం రూరల్

చేయూత లబ్ధిదారుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా పాడి పశువుల కొనుగోలును ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ చేయూత గ్రౌండింగ్, పశుకిసాన్ క్రెడిట్ కార్డ్స్ జారీ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేయూత లబ్ధిదారులు ఉపాధి మెరుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులను ప్రోత్సహించి పాడి పశువులను కొనుగోలు చేయించాలని సూచించారు. పాడి పశువుల గ్రౌండింగ్ చాలా తక్కువ ఉండడంపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. మేలైన పాడి పశువులను గోకవరం, కంకిపాడు, విజయనగరం జిల్లా పెదనకలం తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కనీసం 500 పశువులను వెంటనే గ్రౌండ్ చేయాలని సూచించారు. వివిధ పాడి రైతుల ద్వారా 3,140 లీటర్ల పాలను అమూల్ కేంద్రాలకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నరసాపురంలో 737 లీటర్ల పాల సేకరణను వెయ్యి లీటర్లు, యలమంచిలిలో 490 లీటర్లకు గాను 700 లీటర్లు, పాలకొల్లులో 500లకు 700 లీటర్లు పాల సేకరణ లక్ష్యంగా పనిచేయాలన్నారు. జిల్లాలోని పాడి రైతులందరికీ పశు కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న పాల వెల్లువ కింద నాలుగు మండలాల్లోని 31 గ్రామాల్లో చేసిన సర్వే అనుసరించి నాలుగు వేల పాడి రైతులకు డిసిసిబి ద్వారా పశు కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంపుదలకు అధికారులు కషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్–ఎస్ వేణుగోపాల్, జిల్లా కోపరేటివ్ అధికారి రవికుమార్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర క్షయ వ్యాధి డ్రగ్స్ చీఫ్ డాక్టర్ మిథల్ పాండ్య

ప్రజాశక్తి – ఆచంట

క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర క్షయ వ్యాధి డ్రగ్స్ చీఫ్ డాక్టర్ మిథల్ పాండ్య అన్నారు. బుధవారం ఆచంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఆచంట వేమవరం పిహెచ్‌సిల్లో ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విపరీతమైన దగ్గు వారం రోజులపాటు విడవకుండా ఉంటే సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షలు చేయించుకున్న తరువాత పాజిటివ్ వస్తే ఆశా, ఎఎన్ఎంల ద్వారా డ్రగ్స్ వినియోగించుకోవాలని ఆమె సూచించారు. క్షయ గాలి, నోటి తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. బ్యాక్టీరియా సంబంధిత మందుల ద్వారా కుష్టు వ్యాధిని నివారించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు దిగుపాటి జితేంద్ర, పూజ, టిబి సూపర్‌వైజర్, వెంకట దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆచంటలో వర్షం

ప్రజాశక్తి – ఆచంట

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎడతెరిపి లేని వర్షం పడింది. దీంతో పలు గ్రామాల్లో రహదారులు ఛిద్రమయ్యాయి. రహదారులపై వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆచంట నుంచి ముళ్లపర్రు మీదుగా సిద్ధాంతం వెళ్లే ఆర్అండ్‌బి ప్రధాన రహదారిపై ఏర్పడిన పెద్దపెద్ద గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో అవి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. తక్షణం అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని కోరారు.

జగన్ హయాంలో రాష్ట్రం నాశనం

టిడిపి బస్సు యాత్ర సభలో మాజీ మంత్రులు, ఎంఎల్ఎ

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేశాడని టిడిజి మాజీ మంత్రులు అయ్యన్న పాత్రుడు, ప్రత్తిపాటి పుల్లారావు, ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. టిడిపి భవిష్యత్ గ్యారెంటీ చైతన్య బస్సు యాత్ర, బహిరంగ సభ బుధవారం పెద తాడేపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి మాజీ మంత్రులు, ఎంఎల్ఎలు, మాజీ ఎంఎల్ఎలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెన్షన్లను దఫాదఫాలుగా పెంచుతూ ప్రజల నుంచి ఒక్కొక్కరికీ రూ.26 వేల నష్టం చేకూర్చారన్నారు. రాష్ట్రంలో 42 వేల ఎకరాల దేవాలయ భూములు కనపడడం లేదని, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ అంటున్నారని, ఆ భూములు ఏమయ్యాయని వారు ప్రశ్నించారు. వైసిపి మంత్రులకు కేసులు పెట్టడం తప్ప పాలన సాధ్యం కాదన్నారు. లక్షల కుటుంబాలకు చంద్రన్న బీమా ద్వారా భద్రత కల్పించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. 15 రూపాయలకే మూడుపూటలా అన్నా క్యాంటీన్ ద్వారా అన్నం పెడితే జగన్ ఆ పథకాన్ని రద్దు చేసి పేదల కడుపు కొట్టారన్నారు. అసమర్థులు మంత్రులైతే రాష్ట్రం ఎలా బాగుపడుతుందని విమర్శించారు. టిడిపితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని దీమా వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రజాశక్తి – కాళ్ల

నాడు – నేడులో భాగంగా పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. కోపల్లెలో మంతెన దుర్గరాజు, రాజయ్యమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను జెడ్‌పి ఛైర్మన్ పద్మశ్రీ డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లాలో మన బడి, నాడు–నేడు రెండో విడత పనులు వేగంగా పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచిస్తున్నామన్నారు. అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్లు, మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణ పనులు పాఠశాలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పనుల పరిశీలనలో పేరెంట్స్ కమిటీలను, దాతలను, విద్యార్థులను భాగస్వామ్యం చేయాలన్నారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నాడు–నేడు రెండో విడతలో రూ.36 లక్షల నిధులు మంజూరు చేశామని తెలిపారు. అనంతరం జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెనుమత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసిలు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, యండగండి శ్రీను, రణస్థల కనకదుర్గ మహంకాళి పాల్గొన్నారు.

ఉండి : వందేళ్ల చరిత్ర కలిగి ఉన్న ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేస్తానని ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. బుధవారం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పద్మశ్రీ ఆకస్మిక తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో ఆక్రమణలను తొలగించి ప్రహరీ గోడను ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాల క్రీడా మైదానం వర్షపు నీటితో నిండిపోవడం చూసి విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో ఆటలు అంతే ముఖ్యమని అన్నారు. క్రీడామైదానం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలలో ప్రధాన సమస్యలను గుర్తించి పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం జెడ్‌పి ఛైర్మన్ పద్మశ్రీ దంపతులను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, ఉండి జెడ్‌పిటిసి రణస్థుల కనకదుర్గ మహంకాళి, ఆకివీడు జెడ్‌పిటిసి వేగేశ్న వెంకట్రాజు, ఉండి గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, నాయకులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ పద్మశ్రీ

ఆప్కోస్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని వినతి

నేడు, రేపు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష

ప్రజాశక్తి – భీమవరం రూరల్

మున్సిపాల్టీలో పనిచేస్తున్న ఆప్కోస్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ పిలుపుమేరకు ఈ నెల 20, 21వ తేదీల్లో భీమవరం మున్సిపాల్టీ వద్ద చేపట్టనున్న నిరసన దీక్షలో కార్మికులు పాల్గొనాలని సిఐటియు పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ టి.సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు. ఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి రాగానే మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని, సిపిఎస్ రద్దు చేస్తానని ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. మున్సిపాల్టీలను శుభ్రంగా ఉంచడంలో కార్మికులు ఎంతో శ్రమిస్తున్నారని, వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. సరైన పనిముట్లు లేవని, సరైన సిబ్బంది లేరని పని భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాల్టీ స్కూల్ స్వీపర్లకు నాలుగు నెలలుగా జీతాల్లేవని, నెలకు రూ.4,000 జీవితంతో ఎలా బతుకుతారని ప్రశ్నించారు. స్కూల్ స్వీపర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేసిన కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20, 21 తేదీల్లో భీమవరం మున్సిపాల్టీ వద్ద నిరసన దీక్షలు చేపట్టనున్నామని తెలిపారు. 27న మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, ఆగస్టు 7న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని అప్పటికీ ప్రభుత్వ స్పందించకపోతే ఆగస్టు 15 తర్వాత నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నీలాపు రాజు బంగారు వరలక్ష్మి, ఆకుల సత్యనారాయణ, నేలాపు నాగేశ్వరరావు, ఎం.మునియ్య, విజయలక్ష్మి, దుర్గమ్మ, రాణి పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

స్ఫూర్తి ప్రదాత సాగి రామకృష్ణంరాజు

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు

ప్రజాశక్తి – భీమవరం రూరల్

సామాజిక సేవతో పాటు విద్యారంగం ప్రగతికి కృషి చేసిన సాగి రామకృష్ణంరాజు నేటి సమాజానికి స్ఫూర్తి ప్రదాత అని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు తెలిపారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల, ప్రసాద్ అండ్ కో కన్‌స్ట్రక్షన్స్ సంయుక్త ఆధ్వర్యంలో సాగి రామకృష్ణంరాజు 90వ జయంతి ఉత్సవాలు బుధవారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణంరాజు విగ్రహానికి శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మోషేనురాజు మాట్లాడుతూ చినఅమిరం వంటి చిన్న కుగ్రామంలో సుమారు 43 సంవత్సరాల క్రితం ఇంజినీరింగ్ కళాశాలను స్థాపించి దేశంలో ఆదర్శవంతమైన విద్యాలయంగా దీన్ని తీర్చిదిద్దడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. ఈ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రజా సేవా ఫౌండేషన్ ఏర్పాటు చేసి తమ స్వగ్రామమైన చినఅమిరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వారి వారసులు రామకృష్ణంరాజుపై చూపుతున్న ప్రేమకు తార్కాణమని చెప్పారు. సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ జిఎస్ఎన్.రాజు మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాంట్రాక్టర్‌గా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చేతుల మీదుగా మెటల్‌కింగ్ అవార్డు పొందిన రామకృష్ణంరాజు విద్యారంగానికి చేసిన సేవలు మరువరానివన్నారు. కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ మాట్లాడుతూ చినఅమిరంతో పాటు గ్రామంలోని పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కూడా ట్రస్ట్ ద్వారా సహకార అందిస్తామని హామీ ఇచ్చారు. పేదలకు తమ ట్రస్ట్ సేవలందిస్తోందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు మాట్లాడారు. అనంతరం కళాశాలకు వివిధ రంగాల్లో సేవలందించిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఘనంగా సత్కరించారు. సాగి అచ్యుతరామరాజు పేరిట కళాశాలలో అత్యధిక ప్రాజెక్టులు చేపట్టిన పిఎ రామకృష్ణంరాజును కూడా సత్కరించారు. అలాగే వికలాంగులకు ట్రై సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ మంతెన రామరాజు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.



రామకృష్ణంరాజు విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పిస్తున్న శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి – నరసాపురం టౌన్

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం నరసాపురంలోని – 1వ వార్డులో రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి ముదునూరి ప్రసాదరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఇబ్బందిని గమనించి పురపాలక సంఘం సాధారణ నిధులు మంజూరు చేసి రోడ్డు, డ్రెయిన్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రెనేజీ వ్యవస్థ, కమ్యూనిటీ హాల్ నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎక్కువ నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, వైస్ ఛైర్మన్ కొత్తపల్లి భుజంగ రాయుడు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, సోమరాజు దుర్గాభవాని పాల్గొన్నారు.



రోడ్డు, డ్రెయినేజీకి శంకుస్థాపన చేస్తున్న ముదునూరి

'నాడు-నేడు' పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నాడు-నేడు మిగిలిన పనులు వారం రోజుల్లో 90 శాతం పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి నాడు-నేడు పనులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, మధ్యలో బడి మానేసిన పిల్లలను మళ్లీ బడిలో చేర్పించడం తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై 45 రోజులు అవుతుందని, మిగిలిన పనులు వారం రోజుల్లో 90 శాతం పూర్తి చేయాలని చెప్పారు. మండల అధికారులు క్రమం తప్పకుండా రోజుకు రెండు పాఠశాలలు చొప్పున తనిఖీ చేసి పూర్తి నివేదికలు జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు. మధ్యలో బడి మానేసిన పిల్లలు, మళ్లీ చేర్పించిన పిల్లల వివరాలను కలెక్టర్ మండలాలు, పురపాలక సంఘాల వారీగా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఐసిడిఎస్ పిడి ఎ.సుజాతారాణి, భీమవరం పురపాలక సంఘం ఇన్‌ఛార్జి కమిషనర్ కెటి.సుధాకర్, పాల్గొన్నారు.

పారదర్శకంగా అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అంగన్‌వాడీ పోస్టుల భర్తీ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని భీమవరం ప్రాజెక్ట్ సిడిపిఒ టికెవి.లక్ష్మీకాంత తెలిపారు. 'అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో మాయాజాలం..!' శీర్షికన ప్రజాశక్తిలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. భీమవరం ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త సహాయకురాలి పోస్టుల నియామకంలో అభ్యర్థుల నివాస ధ్రువీకరణ సర్టిఫికెట్ ఆధారంగానే అఫిషియన్స్ తీసుకోనున్నట్లు తెలిపారు. అఫిషియన్స్ వెరిఫై చేసి చెక్ లిస్ట్ ఇస్తామని తెలిపారు. కమిటీ ద్వారానే ఇంటర్వ్యూ చేసి సెలక్షన్స్ చేస్తారన్నారు. నిబంధనల ప్రకారమే పోస్టుల భర్తీ చేస్తామన్నారు. భీమవరం అర్బన్‌కు చెందిన ముగ్గురు అంగన్‌వాడీ సహాయకులు తమ వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేశారన్నారు. భీమవరం అర్బన్‌కి చెందిన అంగన్‌వాడీ కేంద్రం దుర్గాపురం-1 కోడ్ 05/8200ప్రమోషన్‌కి అర్హులైన అంగన్‌వాడీ సహాయకులు ఎవరూ లేనందున నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ నెల 24 వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి అఫిషియన్స్ గడువు ఉందని తెలిపారు.

'రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలి'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని ఎపి చేతివృత్తుల సంఘం జిల్లా నాయకులు ఎం.సీతారాంప్రసాద్ అన్నారు. ఈ నెల 21న రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సదస్సు అనంతపురంలో జరుగుతున్న సందర్భంగా బుధవారం భీమవరం పట్టణంలోని గునుపూడి రజకుల చెరువు వద్ద కరపత్రాలు పంపిణీ చేసే ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా రజక వృత్తిదారులు బట్టలు ఉతుకుతూ సమాజాన్ని శుభ్రంగా ఉంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. రజకులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రజక వృత్తిదారులు వారి వృత్తిని కొనసాగించడానికి వసతులు, గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన చోట దోబీ ఘాట్లను, నీటి, విద్యుత్ సౌకర్యాలను కల్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, సామాజిక భద్రత చట్టం తీసుకొచ్చి రక్షణ కల్పించాలన్నారు. 50 ఏళ్ళు నిండిన ప్రతి రజకునికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలన్నారు. దోబీ ఘాట్లు కబ్జాకు గురవకుండా ప్రభుత్వం తగినచర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ చాంద్ బాషా, లక్ష్మి, వెంకటేశ్వరరావు, రామారావు, సుబ్బయ్య, కె.శీను, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

'ఎస్‌కెఎస్‌డి'ని సందర్శించిన ఆర్.నారాయణమూర్తి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ప్రముఖ రచయిత, దర్శకుడు, నిర్మాత, నటుడు ఆర్.నారాయణమూర్తి బుధవారం తణుకులోని స్థానిక ఎస్‌కెఎస్‌డి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్‌కి విచ్చేశారు. ఈ సందర్భంగా నారాయణ మూర్తి మాట్లాడుతూ త్వరలో విడుదల కానున్న యూనివర్సిటీ అనే సినిమాను విద్యార్థినులందరూ దిగ్విజయం చేయాలని కోరారు. ఈ సినిమా ద్వారా విద్యావ్యవస్థలో వస్తున్న వైపరీత్యాలు, కార్పొరేట్ కళాశాలల దౌర్జన్యాలన్నీ అర్థమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరిబాయ్, వివేకానంద గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి రీనాసాయి పాల్గొన్నారు

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - ఉండి

దిచక్రవాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌పి రవిప్రకాస్ సూచించారు. ఉండి మెయిన్ సెంటర్‌లో బుధవారం ఆకివీడు రూరల్ సిఐ గీతా రామకృష్ణ, ఉండి ఎస్‌ఐ కె.గంగాధరరావు స్పెషల్ హెల్మెట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌పి రవిప్రకాష్ పరిశీలించారు. సిఐ, ఎస్‌ఐ మాట్లాడుతూ భీమవరం నగరంలోకి హెల్మెట్ లేకుండా ప్రవేశం నిషేధించడంతో భీమవరం వెళ్లే ప్రతి మార్గంలోనూ హెల్మెట్ డ్రైవ్ ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనదారులందరూ పోలీసులకు సహకరించి హెల్మెట్ ధరించాలని చెప్పారు.

వికలాంగులకు ఫిజియోథెరపీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక సుబ్బారావుపేట భవిత వికలాంగుల శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్ బుధవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు ఇంటి వద్ద ప్రతిరోజు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ నిర్వహించినట్లయితే పిల్లలు లోపాన్ని అధిగమించి వారు పనులు వారే చేసుకోగలుగుతారని తెలిపారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కె.బాలఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందించే అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుకతో పాటు సమగ్ర శిక్షణ ద్వారా అవసరమైన వికలాంగ పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు వివిధ రకాల అలవెన్స్‌లు, బోధన సామగ్రి అందిస్తున్నారన్నారు. భవిత కేంద్రంలో వికలాంగ పిల్లలకు ప్రతి బుధవారం ఫిజియోథెరపీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వికలాంగ పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'దళితులను మోసగిస్తున్న వైసిపి'

పెనుగొండ :దళితులను వైసిపి ప్రభుత్వం మోసం చేస్తుందని ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బీర నరసింహమూర్తి అన్నారు. మండలంలోని టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆదేశాల మేరకు ఎస్‌సి సెల్ నియోజకవర్గ ఆధ్వర్యంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి వైసిపి ప్రభుత్వం పోరాటం చేస్తుందనడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. టిడిపి చైతన్య రథ యాత్రకు ప్రజల నుంచి విశేషమైన స్పందన లభిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందని చెప్పారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సగంచెరువులో విషాదఛాయలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

విశాఖపట్నం జిల్లా ఎలమంచిలి వద్ద బుధవారం తెల్లవారుజామును చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మండలంలోని సగంచెరువు గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సగంచెరువు గ్రామానికి చెందిన బొక్కా జయభారతికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేశారు. పెద్ద కుమారుడికి కూడా వివాహమైంది. చిన్న కుమారుడు బొక్కా లక్ష్మీనారాయణ అలియాస్ రాజు (30)కు ఇంకా వివాహం కాలేదు. అతను నరసాపురానికి చెందిన హెచరి కంపెనీలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం విశాఖపట్నానికి రొయ్యల లోడు లారీతో బయలుదేరాడు. ఈ క్రమంలో విశాఖపట్నంలోని ఎలమంచిలి వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం మృతదేహాన్ని సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీనారాయణ మృతదేహం పోస్టుమార్టం అనంతరం బుధవారం రాత్రి సగం చెరువుకు చేరుకుంది. పిల్లల చిన్నవయసులోనే తండ్రి చనిపోవడంతో తల్లి జయభారతి తన కష్టార్జితంతో కుమారుడిని డిగ్రీ వరకు చదివించింది. సరైన ఉపాధి దొరకక లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కుమారుని మృతితో తల్లి గుండెలాలిసేలా రోదిస్తోంది. సగంచెరువు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విశ్రాంత ఉద్యోగ పెన్షనర్లు ఇ కెవైసి నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్ర ఆర్థిక శాఖ వారు ఇచ్చిన జిఒ 7 ప్రకారం ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగ పెన్షనర్లు విధిగా ఇకెవైసిని సంబంధిత ఉపఖజానా కార్యాలయాల ద్వారా గాని, ఫోన్ ఆధారిత అప్లికేషన్ ద్వారా త్వరితగతిన నమోదు చేసుకోవాలని జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఆడారి గణేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇక నుంచి ఆధార్ ఆధారిత చెల్లింపుల విధానం అమలు చేసేందుకు ప్రతి విశ్రాంత ఉద్యోగ పెన్షనర్, ఉద్యోగి తన సిఎఫ్ఎంఎస్‌కి తన ఆధార్ కార్డుతో అనుసంధానమైన ఫోన్ నెంబర్‌ను, ప్రస్తుత నివాస అడ్రస్‌ను విధిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. నాటి ఫోన్‌నెంబర్ అందుబాటులో లేకపోతే ప్రస్తుత ఫోన్‌నెంబర్‌ని ఆధార్ నమోదు కేంద్రంలో నమోదు చేయించుకుని అనంతరం ఖజానా కార్యాలయం, పెన్షనర్ అసోసియేషన్ కార్యాలయంలో ఇకెవైసిని క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఫోన్‌కు ఎస్ఎంఎస్ ద్వారా వచ్చిన ఒటిపిని తెలియజేయడంలో ఏమైనా అభద్రత భావం ఉంటే సంబంధిత ఉపఖజానాధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. దూర ప్రాంతంలో ఉంటే బంధువులను సంబంధిత ఉపఖజానా కార్యాలయాలకు పంపించి వారి ద్వారా ఒటిపిని తెలియపరచవచ్చని తెలిపారు.

వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - మొగల్తూరు

పొన్నమండ వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని సర్పంచి కోపనాతి పుల్లయ్య అన్నారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో పొన్నమండ శేషయ్య పార్వతమ్మల జ్ఞాపకార్థం రూ.5 లక్షలతో నిర్మించిన భోజనశాలను బుధవారం సాయంత్రం దాత చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సర్పంచి పుల్లయ్య మాట్లాడారు. పలు దేవాలయాల అభివృద్ధికి కూడా వెంకటేశ్వరరావు సహకరించారన్నారు. దాత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించానన్నారు. అనంతరం వెంకటేశ్వరరావు నాగభార్గవి దంపతులను గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిప్పులేటి రామారావు, దొంగ యుగంధర్, కొల్లాటి ములా స్వామి, ప్రధాన సహాయకులు గోపాలకృష్ణరాజు, స్టాఫ్ సెక్రటరీ కె.నాగరాజు, దొంగ చింతయ్య, నాగిడి భగవాన్ పాల్గొన్నారు.

ఆగర్రులో 'బేటీబచావో-బేటీపడావో'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని ఆగర్రు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బేటీబచావో-బేటీపడావో కార్యక్రమంలో భాగంగా బాలికలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి కె.ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల చదువుకోవాలని, ఆరోగ్యంగా జీవించాలని, రక్త హీనతకు గురి కాకుండా ఉండేందుకు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, స్వశక్తితో ముందుకెళ్లాలని చెప్పారు. సరైన వయస్సులో వివాహాలు చేసుకోవాలని, బాల్య వివాహాలు అరికట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.గిరి, హెల్త్ అసిస్టెంట్ మేడిది మధుకుమార్, ఎఎన్ఎం మరియమ్మ పాల్గొన్నారు.

ఆగస్టులో మహావిశ్వరూప మహాసభ : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - ఆచంట

ఎస్‌సి వర్గీకరణ సాధించేందుకు ఆగస్టు రెండో వారంలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో హైదరాబాదులో మహా విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి పలివెల్ల పైడియ అన్నారు. బుధవారం సాయంత్రం ఆచంటలో ఎంఆర్‌పిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడియ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ అంశంలో 29 ఏళ్లుగా ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో సుదీర్ఘ పోరాటం చేస్తున్నామన్నారు. ఎస్‌సీ వర్గీకరణ అమలు చేస్తామని అన్ని రాజకీయ పార్టీలు హామీ ఇచ్చి చివరికి మోసం చేశాయన్నారు. హైదరాబాదులో జరిగే ఈ మహాసభలో తాడోపేడో తేల్చుకునేందుకు నిర్ణయించుకున్నామన్నారు. మహా విశ్వరూప మహాసభకు ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు కనపాల పెద్దిరాజు, దిగమర్తి వెంకటేశ్వరరావు, తానేటి బాబూరావు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో మహిళలపై పెరిగిపోతున్న దాడులు'

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో మహిళలపైనే కాకుండా బాలికలు, చిన్నారులపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని టిడిపి మహిళా నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పాలకొల్లు ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన టిడిపి మహిళా విభాగ సమావేశంలో టిడిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేని రోజారమణి పాల్గొని మాట్లాడారు. రోజు ఏదో ప్రాంతంలో అత్యాచారాలు జరుగుతున్నా జగన్ డమ్మీ బటన్ నొక్కి కాలక్షేపం చేస్తున్నారన్నారను. పోలీసులు మహిళల రక్షణకు చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఈ సమావేశంలో మహిళా నేతలు ద్రాక్షరపు జ్యోతి, కొండేటి లక్ష్మి, పాలా నాగలక్ష్మి, దబ్బా ఎస్తేరురాణి, వరలక్ష్మి, విజయలక్ష్మి, శారద, సంగుల వరలక్ష్మి పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీని ప్రజల్లోకి తీసుకెళ్తాం'

ప్రజాశక్తి - ఉండి

టిడిపి అధినేత చంద్రబాబు రాష్ట్ర ప్రజల కోసం రూపొందించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. బుధవారం సాయంత్రం ఉండిలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు కన్నెగంటి రూత్‌కళ అధ్యక్షతన నిర్వహించిన మహిళాశక్తి సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు రూపొందించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున ఇంటింటికి వెళ్లి భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందించే సంక్షేమ పథకాల జాబితాను ప్రచారం చేయాలని ఆయన సూచించారు.

అధ్వానంగా సీసీ రోడ్డు ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - వీరవాసరం


అధ్వానంగా ఉన్న సీసీ రోడ్డు

మట్టి రహదారుల వల్ల ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను తొలగించడానికి ప్రభుత్వం సీసీ రోడ్లను నిర్మిస్తోంది. ఆ విధంగా నిర్మించిన సీసీ రోడ్డు కూడా మట్టి రహదారిగా మారిపోవడంతో పెర్కిపాలెం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువుల చెరువుకు వెళ్లే మార్గంలో సుమారు 20 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. గతంలో ఈ మార్గాన్ని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. దాని పక్కనే మురుగు వెళ్లేందుకు సీసీ డ్రెయిన్ కూడా ఉంది. మూడు సీసీ రోడ్లు కలిసే ప్రాంతంలో పల్లంగా ఉండటం, సాంకేతకంగా సీసీ డ్రెయిన్ తప్పుగా నిర్మించడం వల్ల మురుగు పారుదల సవ్యంగా జరగకపోవడంతో ఈ ప్రాంతం మురుగు కూపంలా మారిపోతుంది. వర్షాకాలంలో వర్షపు నీరు అక్కడే పేరుకుపోయి మురికి కూపంలా మారి దోమలకు ఆవాసంగా మారింది. వర్షాకాలమంతా ఇక్కడ ఇదే పరిస్థితి నెలకుంటుంది. దీంతో ఇక్కడ నివసించే వారు కాలు బయటకు పెట్టలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, విద్యార్థులు ఈ మురుగు నీటిలోంచి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ ఉన్న దుర్భర పరిస్థితుల వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థులకు నగదు పురస్కారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన ఆరుగురు విద్యార్థులకు ఆర్థిక నగదుతో ప్రతిభా పురస్కారాలను ఆర్‌డిఒ కార్యాలయంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ భీమవరం పట్టణంలో దాతృత్వం ఒక ఆనవాయితీగా వస్తుందని, పేద, బడుగు వర్గాల విద్యార్థులకు దాతలు సహకరించడం అభినందనీయమని అన్నారు. మున్సిపల్ హైస్కూల్లో అత్యధిక మార్కులు సాధించి ఉన్నత విద్యకు నగదు ప్రోత్సాహం అందించడం గొప్ప విశేషమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తుమ్మలపల్లి మంగరాజు విశ్రాంతి భవన్ ట్రస్ట్ సహకారంతో నూజివీడు ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.మూడు వేల చొప్పున మొత్తం రూ.18 వేలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వై.రవికుమార్, ట్రస్ట్ నిర్వాహకులు తుమ్మలపల్లి నాగశివవెంకటసత్యకృష్ణమూర్తి, తుమ్మలపల్లి ప్రసాద్, తుమ్మలపల్లి ఫణీంద్ర పాల్గొన్నారు.

ఐసిడిఎస్ సిడిపిఒగా మేరీఎలిజబెత్ రాణి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పెనుమంట్ర


మేరీఎలిజబెత్‌రాణిని సత్కరిస్తున్న సిబ్బంది

ఐసిడిఎస్ సిడిపిఒగా మేరీ ఎలిజబెత్‌రాణి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఐసిడిఎస్ సిడిపిఒ ప్రాజెక్టు కార్యాలయంలో ఆమె ఉద్యోగ విరమణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వి.పూర్ణ బాబ్జి, జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి, పెనుమంట్ర ఉప సర్పంచి భూపతిరాజు వెంకటశ్రీనివాసరాజు, ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు, ప్రాజెక్టు పరిధిలో సూపర్ వైజర్లు, మండల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

పట్టణ సమాఖ్య ఏర్పాటు

నూతన కార్యవర్గ అధ్యక్షురాలిగా జ్యోతి

ప్రజాశక్తి - ఆకివీడు

స్వయం సహాయక సంఘాల మహిళా సంఘాల పట్టణ సమాఖ్య ఏర్పడింది. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న ఆకివీడు మూడేళ్ల క్రితం నగర పంచాయతీగా ఏర్పడింది. అయితే పట్టణ సమాఖ్య ఆలస్యంగా ఇప్పుడు ఏర్పడింది. ఆకివీడు పట్టణ పరిధిలో ఉన్న 661 స్వయం సహాయక సంఘాలు, 18 గ్రామ సంఘాలుగా కొనసాగుతున్నాయి. బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలోని మెప్మా కార్యాలయంలో 18 గ్రామ సంఘాల అధ్యక్షులు సమావేశమై నూతన సమాఖ్యను ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యవర్గానికి ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించుకున్నారు. కార్యవర్గ నూతన అధ్యక్షురాలిగా జ్యోతి, ఉపాధ్యక్షురాలిగా కె.రత్నకుమారి, కార్యదర్శిగా కె.రంగమ్మ, కోశాధికారిగా కె.దయామణి, సంయుక్త కార్యదర్శిగా పిఎస్.దుర్గాభవాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలో ఉన్న ఆరు పట్టణ కమిటీలు పూర్తయినట్లు జిల్లా పిఎంవిఐబి గ్రంధి పార్వతి తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం : ఎంఎల్‌ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మిని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంపిడిఒతో అభివృద్ధి పనులకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

మండలాభివృద్ధికి కృషి : ఆచంట ఎంపిపి సూర్యకుమారి

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మండలాన్ని పాలకులు, అధికారుల సహాయ సహకారంతో అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నట్లు ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. ఆచంట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి సూర్యకుమారి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు మాట్లాడుతూ ఆర్‌బికెల్లో ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలన్నారు. మండలంలో వర్షాలు సకాలంలో పడకపోవడంతో సాగునీరు అందటం లేదని రైతులు వాపోతున్నారని ఎంపిటిసి సభ్యులు పృధ్వికుమార్ సుబ్రహ్మణ్యం అన్నారు. జగనన్న కాలనీల్లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లబ్ధిదారులు చెప్పారు. ఆక్వాజోన్‌కు సంబంధించి రైతులకు రాయితీ ఇవ్వడంలేదని వైస్ ఎంపిపి ఎర్రగుప్పుల నాగరాజు అన్నారు. ఎంపిడిఒ జగన్నాధరావు మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు రూ.26 లక్షలతో వివిధ పనులకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసరావు, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రాఘవేంద్రరావును కలిసిన మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావును భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో-కన్వీనర్ ఓలేటి శ్రీను, ఆర్గనైజర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు, కో-ఎడిటర్ కనగర్ల రామకృష్ణ కలిసి సత్కరించారు. తమ అభిమాన దర్శకుడు మంచి అగ్ర చిత్రాల సుపరిచితుడు రాఘవేంద్రరావును కలవడం ఆనందంగా ఉందని వారు తెలిపారు.

'నీచ రాజకీయాలకు శ్రీరంగనాథరాజు దూరం'

ప్రజాశక్తి - పెనుగొండ

కులాలను రెచ్చగొట్టి లబ్ధి పొందే నైజం ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజుకు లేదని ఎంపిటిసి సభ్యులు, ఎస్‌సి సెల్ మాజీ జిల్లా నాయకుడు చిన్నం ఏడుకొండలు అన్నారు. మండలంలోని సిద్ధాంతం గ్రామంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నడిపూడి శివారు మిద్దేవారిపాలెంలో వెలి కేసులో 12 కుటుంబాలపై రెండు సామాజిక తరగతివారు చేసే అరాచకాలను భరించలేక బాధిత కుటుంబాలే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, మండలంలోని దళిత నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

తాడేపల్లిగూడెం :బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు రొక్కాల నాగబుజ్జి అన్నారు. తాడేపల్లిగూడెంలో ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగబుజ్జి, ప్రభుత్వ జూనియర్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ ఎబినేజర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయకూడదని చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా వివాహాలు జరిపించాలని చూస్తే ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

విద్యార్థులకు రేఖీయ బీజాగణితంపై శిక్షణ

ప్రజాశక్తి - ఆకివీడు

విద్యార్థులు రేఖీయ శిక్షాగణితంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు గౌస్ సుల్తానా చౌదరి అన్నారు. మండలంలోని వివిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు అప్లికేషన్స్ ఆఫ్ లీనియర్ ఆల్జీబ్రా (రేఖీయ బీజా గణితం) అంశంపై బుధవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత అధ్యక్షతన నిర్వహించారు. ప్రత్యేక బోధకురాలు(వక్త)గా సుల్తానా హాజరై వివరించారు. గణిత శాస్త్ర అధ్యాపకుడు సి.హరినాథ్ అదే అంశంపై మరికొన్ని విషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల క్యూఎసి సమన్వయకర్త డాక్టర్ సిహెచ్ వి అనిల్డాయ్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'జగన్‌పై అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు సరికావు'

ప్రజాశక్తి - పాలకొల్లు

సిఎం జగన్‌పై మాజీ మంత్రి అయన్నపాత్రుడు వ్యాఖ్యలు సరికావని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లులోని ఆయన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకొల్లులో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో సిఎం జగన్‌పై మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం పేరుతో అధికార పక్షంపై విమర్శలు చేయడం తగదన్నారు. ఆయనతో పాటు వైసిపి నేతలు గుణ్ణం నాగబాబు, డిటిడిసి బాబు మాట్లాడారు.

పాలకొల్లు : పాలకొల్లులో భవిష్యత్తుకు గ్యారెంటీ యాత్రలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సిఎం జగన్‌పై చేసిన వ్యాఖ్యలు సరికావని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. ఆయన కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పాలకొల్లు సీటు వైసిపి గెలుచుకుంటుందని చెప్పారు. టిడిపి భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో వారి ప్రణాళిక గురించి వివరించకుండా వైసిపిని తిట్టడానికి తమ సమయం కేటాయించారని చెప్పారు. ఆయనతో పాటు వైసిపి నేతలు పెచ్చెట్టి కృష్ణాజి, జోగి వడ్డికాసులు, పాలపర్తి కృపానంద్, రేలంగి శ్రీనివాస్, పిల్లా శ్రీను, గంటా నరేష్, చల్లా విజయ్ పాల్గొన్నారు.

మునిసిపల్ ఆఫీసు, పాలకొల్లు

ఆర్.ఓ.సి. నెం. 78/2021/ఇ1 ది.18-07-2023

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘము పరిధిలో నందు NPI నిధులతో పాలకొల్లు పురపాలక సంఘ ప్రజలకు నవరత్నాలు - పేదలందరికీ ఇల్లులో భాగంగా కేటాయించిన - First dose levelling of house sites with earth work exacavation / with selected earth at NPI layout R.S. No. 180, 198 & 199 in Akulavanigaruvu layout -IV నిమిత్తం (పనికి) గాను అంచనాలు విలువ సుమారు రూ. 64,12,000/-లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది. 20-07-2023 తేది సాయంత్రం 4.00 ని॥ల నుండి లభించును.

మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెటు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- బి.ఆర్.యస్.శేషాద్రి, మునిసిపల్ కమిషనరు, పాలకొల్లు

21 నుంచి ఇంటింటా సర్వే ప్రారంభం

ఆచంట :ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఈ నెల 21వ తేదీ నుంచి ఇంటింటా సర్వే ప్రారంభించనునట్లు తహశీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆచంట తహశీల్దార్ కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయిలో బిఎల్ఒలతో, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2024లో జరిగే సాధారణ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలో ఎక్కడ ఎటువంటి అవకతవకలు లేకుండా గ్రామస్థాయి అధికారులు పని చేయాలని ఆదేశించారు. ఒకే ఇంటి నెంబర్‌పై ఎక్కువ ఓట్లు నమోదైతే ఆ ఇంటికి నోటీసు జారీ చేసి తప్పుగా నమోదైన వాటిని వెంటనే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తహశీల్దార్లు ఆర్‌వి.కృష్ణారావు, గురుమూర్తి రెడ్డి, దండు వెంకట అశోక్ కుమార్ వర్మ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, తణుకు

O.S. 178/2021

Between:

విజయ బ్యాంక్, Now బ్యాంక్ ఆఫ్ బరోడా, Rep. by its మేనేజర్, తణుకు -వాది

మరియు

1. మిద్దే సుధాకరరావు, S/o. వెంకటేశ్వరరావు, డో.నెం. 3-108, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. వేముల సూర్య వంశీధర్, S/o. చంద్రశేఖర్, డో.నెం. 4-109, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

-ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంధములో ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికిన్నీ అమలు జరగనందున శ్రీ కోర్టు వారు పేపర్ పబ్లికేషన్ ఆర్డరు వేసియున్నారు. సదరు గ్రంధము **03-8-2023వ తేదీకి వాయిదా** అయివున్నది. కావున మీరిద్దరు సదరు తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ప్రత్యక్షముగా గాని, లేక మీ యొక్క ప్లీడరు గారి ద్వారా హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపవల్సినదిగా ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది. లేని యెడల సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

O.N.KRISHNA
తణుకు Advocate, Tanuku
08-7-2023 Cell: 9848199440

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, తణుకు

O.S. 322/21

Between:

విజయ బ్యాంక్, Now బ్యాంక్ ఆఫ్ బరోడా, Rep. by its మేనేజర్, తణుకు -వాది

మరియు

1. వేముల వెంకటరత్నం గాంధీ, S/o. మోహనరావు, డో.నెం. 4-118, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. వేముల నాగలక్ష్మి, W/o. వెంకటరత్నం గాంధీ, డో.నెం. 4-118, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

-ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంధములో ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికిన్నీ అమలు జరగనందున శ్రీ కోర్టు వారు పేపర్ పబ్లికేషన్ ఆర్డరు వేసియున్నారు. సదరు గ్రంధము **03-8-2023వ తేదీకి వాయిదా** అయివున్నది. కావున మీరిద్దరు సదరు తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ప్రత్యక్షముగా గాని, లేక మీ యొక్క ప్లీడరు గారి ద్వారా హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపవల్సినదిగా ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది. లేని యెడల సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

O.N.KRISHNA
తణుకు Advocate, Tanuku
08-7-2023 Cell: 9848199440

మహారాజశ్రీ I అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, తణుకు

O.S. 320/21

Between:

విజయ బ్యాంక్, Now బ్యాంక్ ఆఫ్ బరోడా, Rep. by its మేనేజర్, తణుకు -వాది

మరియు

1. వేముల సుబ్బలక్ష్మి, W/o. చిరంజీవి, డో.నెం. 4-120, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. పితాని సత్యనారాయణ, S/o. గాంధీ, డో.నెం. 21-8-11/ఎ, యడ్ల బజార్, పాలకొల్లు.

-ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంధములో ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికిన్నీ అమలు జరగనందున శ్రీ కోర్టు వారు పేపర్ పబ్లికేషన్ ఆర్డరు వేసియున్నారు. సదరు గ్రంధము **03-8-2023వ తేదీకి వాయిదా** అయివున్నది. కావున మీరిద్దరు సదరు తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ప్రత్యక్షముగా గాని, లేక మీ యొక్క ప్లీడరు గారి ద్వారా హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపవల్సినదిగా ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది. లేని యెడల సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

O.N.KRISHNA
తణుకు Advocate, Tanuku
08-7-2023 Cell: 9848199440

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, తణుకు

O.S. 325/2021

Between:

విజయ బ్యాంక్, Now బ్యాంక్ ఆఫ్ బరోడా, Rep. by its మేనేజర్, తణుకు -వాది

మరియు

1. రేలంగి నరసింహమూర్తి, S/o. వెంకటరావు, డో.నెం. 24-15-19, శంభునిపేట, పాలకొల్లు.
2. రేలంగి పద్మావతి, W/o. నరసింహమూర్తి, డో.నెం. 24-15-19, శంభునిపేట, పాలకొల్లు.

-ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంధములో ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికిన్నీ అమలు జరగనందున శ్రీ కోర్టు వారు పేపర్ పబ్లికేషన్ ఆర్డరు వేసియున్నారు. సదరు గ్రంధము **03-8-2023వ తేదీకి వాయిదా** అయివున్నది. కావున మీరిద్దరు సదరు తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ప్రత్యక్షముగా గాని, లేక మీ యొక్క ప్లీడరు గారి ద్వారా హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపవల్సినదిగా ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది. లేని యెడల సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

O.N.KRISHNA
తణుకు Advocate, Tanuku
08-7-2023 Cell: 9848199440